అర్హులందరికీ సంక్షేమం.. జగనన్న సురక్ష లక్ష్యం



భీమడోలులో జగనన్న సురక్ష కార్యక్రమంపై మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు

భీమడోలు: అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని జగనన్న సురక్ష కార్యక్రమం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు అన్నారు. భీమడోలు ఆర్‌బీకే-1 వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ప్రసంగాన్ని మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హత ఉండి ఏదైనా సాంకేతిక సమస్య కారణంగా ఆగితే సంబంధిత అధికారుల బృందం సచివాలయాల్లో ఆ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారుల బృందాలు ప్రజల వద్దకు వస్తాయన్నారు. ప్రభుత్వ సేవలు సంతృప్తికర స్థాయిలో ప్రతి కుటుంబానికి అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మండలంలో ఎంపీడీవో, తహసీల్దార్ టీములు జూలై 1 తేదీ నుంచి సచివాలయాల వారీగా వెళ్లి పథకాలు అమలు తీరును పరిశీలిస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఆర్డీవో, ఎంపీపీ, అధికారులు



ఉంగుటూరులో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న గ్రామ ప్రజాప్రతినిధులు

జగనన్న సురక్ష పథకాన్ని వీక్షించిన ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు: జగనన్న సురక్ష పథకం ప్రారంభం సందర్భంగా సీఎం జగన్ ప్రసంగాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన టీవీల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వీక్షించారు. ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పి.బాలకృష్ణ, సందక రాంబాబు, వీవర్సు సొసైటీ జిల్లా అధ్యక్షుడు దొంతం శెట్టి సత్యనారాయణ, నాయకులు కొండ్రెడ్డి సర్వేశ్వరవవు, రంగు వెంకటేశ్వరరావు, మందజయలక్ష్మి, గ్రామ కార్యదర్శి గిరిధర్ పాల్గొన్నారు. నారాయణపురం సచివాలయంలో ఉపసర్పంచి అడపాశ్రీను, ఎంపీటీసీ సభ్యులు బండారునాగరాజు, సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో క్షేత్ర పరిశీలన

జగనన్న సురక్ష పథకాన్ని డీఎల్‌డీవో రమణ శుక్రవారం ప్రారంభించారు. గోపినాథపట్నంలో వలంటీర్లు గ్రామంలో గృహసందర్శనను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈమేరకు ఆయన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు కొన్ని సూచనలు చేశారు. డీఎల్‌డీవో రమణతోపాటు ఎంపీడీవో ఇన్‌ఛార్జి ఆంజనేయులు, సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష

పెదవేగి : రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా పెదవేగి మండలంలోని అధికారులందరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారని ఏలూరు ఆర్డీవో కే పెంచల కిషోర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన మండల అధికారులందరూ జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు పెదవేగి మండలంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా ప్రతి సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎంపీపీ తాతా రమ్య , ఎంపీడీవో జి ఆర్ మనోజ్, కార్యదర్శి ప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాల నమోదు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ.రాజేశ్వరి

దెందులూరు: కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో విధిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని, తద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న పథకాలను పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ.రాజేశ్వరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరిగ్రేస్‌కుమారి అన్నారు. శుక్రవారం సోమవరప్పాడులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడుతూ బాధితులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సలహాలను పొందాలని సూచించారు. రవాణా, పోస్టల్, బీమా, బ్యాంకు, విద్య, వైద్యం, రక్షణ, పారిశుద్ధ్యం, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఉపాధి పనులకు సంబంధించి ఏ విధమైన భంగం కలిగినా వాటి పరిష్కారం, నష్టపరిహారం కోసం ఈ శాశ్వత న్యాయపీఠాన్ని సంప్రదించవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే తీర్పులు సివిల్ కోర్టులతో సమానమన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పీ.వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎస్. నాగరాజు, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులున్నారు.

నాణ్యమైన సేవలు పొందడం మన హక్కు



విద్యుత్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ

గణపవరం: విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు పొందడం హక్కు అని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు, హక్కులపై కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సుకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు అధ్యక్షత వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. 1912 నంబరుకు కాల్‌చేస్తే 6 గంటల వ్యవధిలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాల వల్ల వినియోగదారులకు నష్టం జరిగితే వారు సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు డీవీవీ చినసత్యనారాయణ, సీజీఆర్ఎఫ్ సభ్యుడు ఎన్.వెంకటేశ్వరరావు, డా. సురేంద్రకుమార్, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, తాడేపల్లిగూడెం డివిజన్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, గణపవరం, నిడమర్రు మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- చురుగ్గా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు
- విద్యుత్ లైన్లు, రహదారులు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు



పోలసానిపల్లి లేఅవుట్‌లో గ్రావెల్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా తదితరులు

భీమడోలు: పోలసానిపల్లి వాసుల 35 ఏళ్ల నాటి సొంతింటి కల సాకారం కానుంది. పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాల్లో ఇళ్లను చురుగ్గా నిర్మించుకుంటున్నారు. మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు సొంతింటి జాగా కోసం ఎదురు చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అర్హులందరికీ ఇళ్లు పథకానికి ఎన్నికల్లో హామీ ఇచ్చి పేదవాడికి సెంటున్నర భూమి ప్రైవేటు భూమి కొనుగోలు చేసి వారికి అందివ్వడమే కాకుండా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.8 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకంలో రూ.28వేల వరకు నిధులు అందించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పట్టుదలతో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా సహాయ సహకారాలతో గ్రామంలోని మూడు ప్రాంతాల్లో ప్రైవేటు భూమిని కొనుగోలు చేసారు. మూడు లేఅవుట్లలో పేదలైన 187 మందికి పట్టాలను అందించారు. ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారు. పోలసానిపల్లి శివారు గురుకుల కళాశాలకు ఎదురుగా ఉన్న 46 మందికి పట్టాలివ్వగా వారంతా ఇళ్లు నిర్మించుకుంటుకున్నారు. కాలనీలో ఇళ్లు నిర్మాణం పూర్తి కాస్తున్న నేపథ్యంలో ఆ కాలనీలో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా పర్యవేక్షణలో గ్రావెల్ రోడ్లు వేశారు. లక్షలాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేసారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఇటీవల ఇంటింటికీ కుళాయి, వీధి లైట్లను ఏర్పాటు చేసారు. నూతన రోడ్ల నిర్మాణ పనుల్లో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, వార్డు సభ్యులు అనంతమ్మ, కోట శ్రీనివాసరావు, నాయకులు కోట శంకర్, సుభాని, రాజేష్, మంచెం నాగేశ్వరరావు, కోట దుర్గారావులు తదితరులు సహకరించారు.

మలేరియా నిర్మూలనకు సహకరించాలి



మలేరియాపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది



దెందులూరులో అవగాహన ర్యాలీ నిర్వహించిన జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన, దోమల వ్యాప్తి, నివారణ, దోమలనుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇళ్ల పరిసరాల్లోని మురుగు నీటికుంటలు తొలగించుకోవాలని, నీరు నిల్వ చేసే తొట్టెలు శుభ్రం చేయాలని, పాత సామాన్లు, కొబ్బరి బొండాలు, రుబ్బు రోళ్లు, వంటివాటిలో దోమల లార్వా ఏర్పడి, దోమలు వృద్ధి చెందుతాయని అందువల్ల అలాంటి వస్తువులు ఇళ్ల ఆవరణలో ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

దెందులూరు: దోమల వల్ల మలేరియా జ్వరం సంక్రమిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో, వ్యక్తిగత, సామూహిక శుభ్రత పాటించాలని మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం దెందులూరులో మలేరియా అవగాహన ర్యాలీ ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తొలుత దెందులూరు ఉన్నత పాఠశాలలో మలేరియాపై క్విజ్ పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఎంపీహెచ్ఈఓ సీహెచ్‌వీఎస్ నాగరాజు, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలున్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: జంగారెడ్డిగూడెం రోడ్డు- సోమవరప్పాడు జగనన్న కాలనీ నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవరప్పాడు వైఎస్సార్ సీపీ నాయకులు చల్లపల్లి రామకృష్ణ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి మండలంలోని ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసి సమస్యలు వివరించారు. దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ నాయకులు కాగిత అచ్యుత్‌పూలే, మట్టా రమాశంకర్, ఆరేపల్లి నాగవెంకట శ్రీనివాస్‌గౌడ్, తాతా మురళి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్డులకిరువైపులా తాటిచెట్లు, ఈతచెట్లు నాటించాలని, కల్లు గీత కార్మికుల పెన్షన్ మంజూరులో నియమ నిబంధనలు మార్చు గౌడ బంధు సంక్షేమ పథకంలో సంవత్సరానికి రూ. 15 వేలు మంజూరు జనాభా ప్రతిపాదికన గౌడ కమ్యూనిటీ గల గ్రామాల్లో గౌడ కల్యాణ మండపాల నిర్మాణాలు చేపట్టాలని వినతిపత్రాలు అందజేశారు. అన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సిఫార్సు చేశారు.

విస్తృతంగా మానవత సేవలు



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న మానవత సభ్యులు, ఎంపీపీ అర్ధవరం రాము

గణపవరం: మానవత సేవలు అభినందనీయమని గణపవరం మండల అధ్యక్షుడు అర్ధవరం రాము అన్నారు. శుక్రవారం గణపవరం వర్తక సంఘ భవనంలో గణపవరం మండల మానవత కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు అధ్యక్షతన జరిగింది. మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు జానకిరామరాజు, జిల్లా మానవత కెరీర్ గైడెన్స్ చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, వర్తకసంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు పాల్గొన్నారు. పదో తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేసి, వారిని సన్మానించారు. మండల నూతన కమిటీ చైర్మన్‌గా కంతేటి సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడుగా బుద్దారపు పుల్లయ్య, కార్యదర్శిగా మాదేపల్లి చిరంజీవి, కోశాధికారిగా పెరుమాళ్ల ఆంజనేయులు ప్రమాణస్వీకారం చేశారు.

జిల్లాలో పంచాయతీ రాజ్ కమిటీల నియామకం



వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని కలిసిన పుప్పాల గోపి

ఉంగుటూరు: జిల్లాలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం కమిటీలను త్వరలో పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి వెల్లడించారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తాడేపల్లిలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పార్టీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుల సమావేశంలో దిశ నిర్దేశం చేశారని గోపి చెప్పారు. జిల్లా కమిటీలో ఇద్దరిని ఉపాధ్యక్షులుగా, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక ప్రధాన కార్యదర్శిని, ఇద్దరు కార్యదర్శులను, ఇద్దరు సంయుక్త కార్యదర్శులను నియమించాల్సి ఉందని ఆయన శుక్రవారం తెలిపారు. పార్టీ నుంచి గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారని అన్నారు.

నేడు డీలర్ల కాటాలు, ఈపోస్ యంత్రాల మరమ్మతులు

దెందులూరు: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు శనివారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని డీఎస్ఓ కార్యాలయంలో తమ ఈ పోస్ యంత్రాలు, కాటాలు తీసుకురావాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ కోరారు. ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల డీలర్లు పనిచేయని ఈపోస్ యంత్రాలు, కాటాలను తీసుకువచ్చి మరమ్మతులు చేయించుకోవాలని రామకృష్ణ కోరారు.

విద్యుత్ అధికారులకు అదనపు విధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు, పరిపాలన సౌలభ్యం కోసం అసిస్టెంట్ ఇంజినీర్లు లేని ప్రాంతాల్లో డిప్యూటీ ఈఈలకు అదనపు విధులు కేటాయిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గోపాలపురం డిప్యూటీ ఈఈకి గోపాలపురం సెక్షన్, పెనుగొండ డిప్యూటీ ఈఈ ఎం.నిరంజన్ బాబుకు పెనుగొండ సెక్షన్, కామవరపుకోట డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు కామవరపుకోట సెక్షన్, జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఈఈ యు.సుబ్బారావుకు జంగారెడ్డిగూడెం సెక్షన్, జీలుగుమిల్లి డిప్యూటీ ఈఈ టి.వెంకటరావుకు దర్బగూడెం సెక్షన్ ఇన్‌ఛార్జీలుగా విధులు కేటాయించారు. పాలకొల్లు డిప్యూటీ ఈఈ ఆర్ నాగేశ్వరరావుకు ఆచంట, నల్లజర్ల డిప్యూటీ ఈఈ డి.రాజబాబుకు నల్లజర్ల, భీమడోలు డిప్యూటీ ఈఈ కె.గోపాలకృష్ణకు ఎం.నాగులపకల్లి సెక్షన్ ఇన్‌చార్జీలుగా అదనపు విధులు కేటాయించారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఏఈఈగా పని చేస్తున్న ఎన్ పద్మినిని ఏలూరు పవర్‌పేట ఏఈఈగా, పవర్‌పేట ఏఈగా పని చేస్తున్న కె.వెంకటేశ్వరరావును ఏలూరు నార్త్ సెక్షన్ ఏఈగా బదిలీ చేశారు.

ఏలూరు కమర్షియల్ -1 డివిజన్ కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్న ఆర్. భీమేశ్వరరావును ఎం.నాగులపల్లికి బదిలీ చేసి ఏలూరులో ఆయన చేస్తున్న పాత విధుల్లోనే పని చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు భీమవరం డీపీఈ-2 ఏఈగా పని చేస్తున్న టి.పెద్దిరాజును గత 8 నెలల నుంచి ఖాళీగా ఉన్న తణుకు రూరల్ ఏఈ స్థానానికి బదిలీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



పిప్పరలో సీసీ డ్రెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని, వీటిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. పిప్పర బీసీ కాలనీలోని లోతట్టు ప్రాంతంలో రూ.17 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌ను,ఉండి పంటకాలువపై రూ.6 లక్షలతో నిర్మించిన మంచినీటి రేవును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, సర్పంచ్ కాకర బేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి దానమ్మ, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ హరనాథ్‌రాజు, పార్టీ నాయకులు కాకర శ్యాం, ముత్యాల రాంబాబు, ఐఎస్ఎన్ రాజు సర్పంచ్‌లు ఆదిమూలం శ్రీనివాస్, శీతాలం పుల్లయ్యనాయుడు, నక్కా సూరిబంగారయ్య పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు మోక్షం

పిప్పరలో ఎర్రకాలువకు ఆనుకుని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో ఉన్న లోతట్టు ప్రాంతమైన బీసీ కాలనీ చిన్నపాటి ఏటా వర్షానికే ముంపుబారిన పడుతుంది. భారీ వర్షాలు కురిసినా, ఎర్రకాల్వకు వరదలు వచ్చినా ముందుగా మునిగిపోయేది ఈ ప్రాంతమే. ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక పాఠశాల ఏరియాలో రెండు నుంచి మూడు అడుగుల లోతున వర్షం నీరు నిలిచి ఉంటుంది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈసమస్యను గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దృష్టికి కాలనీ వాసులు, స్థానిక నాయకులు తీసుకువచ్చారు. ఆయన ఆదేశాల మేరకు కాలనీలో ముంపు సమస్యకు పరిష్కారంగా రూ.17 లక్షలతో సీసీ డ్రెయిన్‌ను నిర్మించారు. దీనితో ఈకాలనీ వాసులకు ముంపు సమస్య నుంచి విముక్తి లభించింది.

పేకాట శిబిరంపై దాడి

పెదవేగి : పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఆదేశాలపై ఏలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డికి శుక్రవారం అందిన సమాచారం మేరకు పెదవేగి మండలం నడిపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,750 నగదు, ఐదు సెల్ ఫోన్లు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై తదుపరి చర్యల కోసం పెదవేగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్సై తెలిపారు, ఈ దాడుల్లో ఎస్సై సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఉంగుటూరు: చేబ్రోలులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.20,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై స్వామి శుక్రవారం తెలిపారు. సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దారును కలుసుకున్న ఎంపీటీసీ సభ్యులు



కార్యాలయంలో డీటీ దుర్గాప్రసాద్‌ను కలిసి అభినందిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

ఉంగుటూరు: డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన బొడ్డేపల్లి ప్రసాదును ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఉంగుటూరు ఎంపీటీసీ సందక శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. డీటీ ప్రసాద్‌కు శాలువా కప్పి సత్కరించారు.

సోమవరప్పాడు సచివాలయంలో తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్ఎస్ కృపావరం

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం దెందులూరు మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్ఎస్ కృపావరం తనిఖీ చేశారు. జగనన్న సురక్ష పథకం అమలు, ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది, హాజరు, సచివాలయంలో సమస్యలు, సమస్యల పెండింగ్, రిజిస్టర్ నిర్వహణ, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, ర్పంచ్ సరిగే నాగరాజు, కార్యదర్శి ముంగర శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు-2 పాఠశాల వద్ద జగన్న విద్యా కానుకను సర్పంచి బండారు సింధు విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఉన్నతికి ఎదగాలని కోరారు. హెచ్ ఎం రాంబాబు, తల్లితండ్రులు, పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై అధికారుల విచారణ

దెందులూరు: స్థానిక 9వ వార్డు సెంటరులో డ్రెయిన్ల ఆక్రమణలు తొలగించి మురుగునీరు దిగువ ప్రాంతానికి ఆటంకం లేకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం దెందులూరులో అధికారులు విచారణ నిర్వహించారు. మురుగు డ్రెయిన్‌ను పరిశీలించారు. క్షేత్ర పరిశీలన నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు వివరించారు.

ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

భీమడోలు: బీజేపీ, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు శ్లాఘనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అన్నారు. భీమడోలు బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

ఉంగుటూరు: అఖండ భారతావని కోసం ప్రాణాలు అర్పించిన జన సంఘ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అన్నారు. శుక్రవారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని నారాయణపురంలో నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నూకల రోహిత్ నాయుడు,రాజు, బాబి, సచిన్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో వైద్య సేవలు

గణపవరం: ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, దీనిలో భాగంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం చిలకంపాడు, కాశిపాడు గ్రామ సచివాలయాల వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, కిశోర బాలికలను పరీక్షించి మందులు ఇచ్చారు. మంచానికి పరిమితమైన రోగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుగర్, బీపీ పరీక్షలు చేసి నెలకు సరిపడ మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, డేటా ఆపరేటర్ వసంత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.